TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు — తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

**విలేఖరులు కావలెను...**

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్ : హైదరాబాద్ సంపుటి :01 సంచిక : 136 బుధవారం 08-01-2025 పేజీలు :05 వేల : 05/-

# మార్చి నెలాఖరుకి టీజీపీఎస్సీ గ్రూప్ 1 నియామకాలు పూర్తి



**హైదరాబాద్ (మన వెలుగు) జనవరి 07 :** తెలంగాణ టీజీపీఎస్సీ గ్రూప్ 1 ఫలితాలు మార్చి 31లోగా విడుదలవనున్నాయి. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల జరిగిన ఓ సమావేశంలో ప్రకటించారు. మొత్తం 563 గ్రూప్ 1 ఉద్యోగాలను మార్చి నెలాఖరు నాటికి భర్తీ చేయబోతున్నట్లు సీఎం రేవంత్ వెల్లడించారు. ఇప్పటికే ఈ పోస్టులకు సంబంధించిన ప్రిలిమ్స్, మెయిన్స్ పూర్తవగా త్వరలో ఫలితాలు వెల్లడించి నియామకాలు పూర్తి చేయనున్నట్లు వివరించారు. రాజీవ్‌గాంధీ అభయహస్తం పథకం కింద సివిల్స్ మెయిన్స్ రాతపరీక్షలో ప్రతిభ చూపి ఇంటర్వ్యూకు ఎంపికైన 20 మంది అభ్యర్థులకు జనవరి 5న ప్రజాభవన్‌లో రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశారు. సింగరేణి సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ%ొ%గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలను ఏదో రకంగా అడ్డుకుని కాలయాపన చేయాలని కొందరు కుట్ర చేశారన్నారు. కానీ మా ప్రభుత్వం యువత ఉపాధి అవకాశాల కోసమే ఆలోచిస్తుందని, ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత గ్రూప్-1 పరీక్షల ప్రకటనను 2011లో వచ్చింది. మళ్లీ 14 ఏళ్ల తరవాత 2025లో ఈ నియామకాలు చేపట్టబోతున్నామన్నారు. అప్పట్లో గ్రూప్ 1కి సన్నద్ధమైన 21, 22 ఏళ్ల నిరుద్యోగులకు ఇప్పుడు 35 సంవత్సరాలకు చేరుకుంటారని అన్నారు. 14 ఏళ్ల పాటు వారిని త్రిశంకుస్వర్గంలో ఉంచడం కన్నా నరకం ఏమైనా ఉంటుందాని ప్రశ్నించారు. సివిల్స్ పరీక్షలకు శిక్షణ పొందే వారికి ఢిల్లీలో అవసరమైన సహకారం అందించాలని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌కు ఆదేశాలిస్తామన్నారు. అత్యధికంగా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లు తెలంగాణ నుంచే ఎంపికవుతున్నారని, అందుకు అనుగుణంగా తెలంగాణ పిల్లలు రాణించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. జాబ్ క్యాలెండర్‌లో ఇచ్చిన తేదీల ప్రకారం నియామకాలు చేపట్టడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.వెనుకబడిన రాష్ట్రమైన బిహార్ నుంచి ఎక్కువమంది సివిల్స్ విజేతలుగా నిలుస్తున్నారని, అలాగే తెలంగాణ నుంచి కూడా ఎంపికవ్వాలని రూ.లక్ష చొప్పున సాయం చేస్తున్నట్లు తెలిపారు. పుస్తకాలు కొనడానికి డబ్బులు లేకపోయినా కూలీగా పనిచేస్తూ ఐఆర్ఎస్‌కు ఎంపికైన బలరాం.. ప్రస్తుతం సింగరేణి సీఎండీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. సివిల్స్‌లో టాప్ ర్యాంకులు సాధించి తెలంగాణకు సేవలు అందిస్తే మంచిది. ఇతర రాష్ట్రాలకు ఎంపికైనా తెలంగాణకు సహకారం అందించాలని అన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలో 55,143 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి దేశానికి ఆదర్శంగా నిలిచామని, పదేళ్లుగా పేరుకుపోయిన నిర్లక్ష్యాన్ని వదిలించి ప్రతిశాఖలో ఉద్యోగాలను భర్తీ చేస్తున్నందుకు గర్వంగా ఉందని అన్నారు. సివిల్స్ ఇంటర్వ్యూకు వెళ్లే ప్రతిఒక్కరూ ఎంపికవ్వాలని ఆకాంక్షిస్తున్నట్లు రేవంత్‌రెడ్డి చెప్పారు.

# నా మాటలు రాసిపెట్టుకోండి కేటీఆర్ ఆసక్తికర ట్వీట్




**హైదరాబాద్ (మన వెలుగు) జనవరి 07 :** ఫార్ములా ఈ-కారు రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కు వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. హైకోర్టు ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసింది. అలాగే ఈడీ మరోసారి కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16న తమ ఎదుట హాజరు కావాలని నోటీసులు ఇచ్చింది. ఇలా ఈ కేసు వ్యవహారంలో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా కేటీఆర్ ఓ ఆసక్తికర ట్వీట్ చేశారు. నా మాటలు రాసిపెట్టుకోండి. ఎదురుదెబ్బల నుంచి బలంగా పుంజుకుంటాం. మీ అబద్ధాలు నన్ను అడ్డుకోలేవు. మీ ఆరోపణలు నన్ను తగ్గించలేవు. మీ చర్యలు నా దృష్టిని మరుగుపరచలేవు. మీ కుట్రలు నా నోరు మూయించలేవు. నేటి అడ్డంకులే రేపటి విజయానికి నాంది. సత్యం కాలంతో పాటు ప్రకాశిస్తుంది. నేను మన న్యాయవ్యవస్థను గౌరవిస్తాను. న్యాయం గెలుస్తుందని నా అచంచలమైన నమ్మకం. సత్యం కోసం నా పోరాటం కొనసాగుతుంది. త్వరలో ప్రపంచం కూడా దానికి సాక్ష్యమవ్వనుంది" అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# మినీ మేడారం జాతర పనులను సకాలంలో పూర్తి చేయాలి



- అన్ని పనులు నాణ్యతతో శశ్వతంగా నిలిచే విధంగా ఉండాలి
- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దు
- జాతర విజయవంతనికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలి
- రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ మంత్రి సీతక్క

**ములుగు ప్రతినిధి (మన వెలుగు) జనవరి 07 :** ఫిబ్రవరి 12 నుండి 15వ తేదీ వరకు జరగనున్న మినీ మేడారం జాతరకు చేపట్టిన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని, ప్రతి పని నాణ్యతతో చేపట్టి శాశ్వతంగా నిలిచిపోయేలా ఉండాలని రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మహా జాతర సందర్భంగా జరిగిన చిన్న చిన్న సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. రానున్న మినీ మేడారం జాతరను పురస్కరించుకొని రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క మంగళవారం సాయంకాలం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, ఎస్పీ శభరీష్, ఐటీడీఏ పిఓ చిత్ర మిశ్రా, జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల ద్వారా చేపట్టనున్న పనుల అంచనా వివరాలను మంత్రికి సమర్పించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మినీ మేడం జాతరను పురస్కరించుకొని గత పక్షం రోజులుగా భక్తులు రాక పెరిగిపోయిందని, ఫిబ్రవరి మొదటి వారం నుండే భక్తుల తాకిడి అధికం కానున్న సందర్భంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మేడారం జాతరకు వచ్చి అన్ని లింక్ రోడ్లను జనవరి 31 లోగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని, అమ్మవార్ల ను భక్తులు దర్శించుకునే సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు మంచినీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. జాతర సందర్భంగా పారిశుద్ధ్య లోపం జరగకుండా ప్రత్యేక పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని డిపిఓను ఆదేశించారు. ఐదు రోజులపాటు నిరంతరం విద్యుత్ సరఫరా చేయడంతోపాటు, పూర్తిస్థాయిలో మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని, జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జంపన్న వాగు వద్ద మహిళా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం బట్టలు మార్చుకోవడానికి ప్రత్యేక షెడ్యూల్ ఏర్పాటు చేయాలని, భక్తులకు అవసరమే పనులను త్వరగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు సూచించారు. జిల్లా అధికారులు సమర్పించిన అంచనాల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి అవసరం కానున్న నిధులను మంజూరు చేయిస్తానని, జాతర విషయంలో జిల్లా యంతరంగంతో పాటు ఐటిడిఏ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ సమావేశం లో ఎండోమెంట్ ఈ ఓ రాజేందర్, ఇంజనీరింగ్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఐటిడిఏ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# సుందరీకరణలో జరిగిన అవినీతిపై
# విజిలెన్స్ విచారణ జరిపించాలి

**కరీంనగర్ (మన వెలుగు) జనవరి 07 :** కరీంనగర్ నగర శివారులోని తీగల వంతెన నిర్మాణంలో, రివర్ ఫ్రంట్,నగరంలోని కూడళ్ల సుందరీకరణ పనులలో జరిగిన అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విజిలెన్స్ విచారణ జరిపించాలని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజులు ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో కరీంనగర్ నీ పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పి అప్పటి మంత్రి ప్రస్తుత శాసనసభ్యులు గంగుల కమలాకర్ గుజరాత్ సబర్మతి నది ఒడ్డున ఉన్న తరహాలో కరీంనగర్లో కూడా రివర్ ఫ్రంట్ ను ఏర్పాటు చేస్తున్నామని 410 కోట్లతో రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు ప్రారంభించి మళ్లీ దానిని డబ్బులు చాలవని480 కోట్లకు పెంచుకొని రివర్ ఫ్రంట్ నిర్మాణాన్ని ప్రారంభించారని కానీ ఇది నత్త నడకన మధ్యలోనే పనులను నిలిపివేయడం దుర్మార్గమైన చర్యని వారు ఆరోపించారు. దీని శంకుస్థాపనకు అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి తారక రామారావును పిలిపించి అంగు ఆర్భాటాలు చేశారు తప్ప పనిని మాత్రం పూర్తి చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.జరిగిన పనిలో పూర్తిగా బండ, ఇసుక, మొరం పూర్తిగా మానేరు డ్యామ్ కు చెందిన దేనని ఇందులో కూడా పూర్తిగా కుంభకోణం జరిగిందని దీనిపై సమగ్రమైన విచారణ జరిపితే అధికారులు రాజకీయ నేతల ప్రమేయం బయటికి వస్తుందని అన్నారు.రివర్ ఫ్రంట్ పనుల్లో పూర్తిగా నాసిరకం పనులు చేశారని నాణ్యత పనులు చేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేశారని కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల కోట్ల రూపాయలు నీటిలో కలిసిపోయే ప్రమాదం ఉందన్నారు.దాదాపు 200 కోట్లకు పైగా ఎస్టిమేషన్ తో ప్రారంభమైన తీగల వంతెన 280 కోట్లతో నిర్మాణం చేశారని ఈ యొక్క తీగల వంతెన నిర్మాణం జరిగి రెండు సంవత్సరాలు కావస్తున్న వంతెన పైనున్న రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడం జరిగిందని వంతెన పైన ఉన్న లైటింగ్ పూర్తిగా రావడం లేదని దీనికి బాధ్యులైన కాంట్రాక్టర్ పై క్రిమినల్ కేసు నమోదు చేసి బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు.కూడల సుందరీ కరణ పేర తెలంగాణ చౌక్ తో పాటు అనేక చోట్ల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని నీటిపాలు చేశారని మార్కెట్ నిర్మాణాల పేరుతో ఇష్టానుసారంగా దోచుకున్నారని దీనికి బాధ్యులైన నగర మేయర్,ప్రజా ప్రతినిధులను దోషులుగా ప్రజల ముందు నిల్పాలన్నారు.కోట్ల రూపాయల పనులు మధ్యలో వదిలి వేయడం వల్ల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం గత పనులపై విచారణ జరిపి మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకొని పనులను వెంటనే ప్రారంభించాలని వారు కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో కోట్ల రూపాయల కుంభకోణాలు కరీంనగర్ నగరంలో జరిగాయని వీటన్నింటిపై విజిలెన్స్ విచారణ జరిపించి దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఈ రేస్, కాళేశ్వరం తదితర అవినీతిపనులపై విచారణ జరుగుతున్నాయని కరీంనగర్ నగరపాలక సంస్థలలో జరిగిన దానిపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ జరిపించాలన్నారు.లేని పక్షంలో సిపిఐ ఆందోళన చేస్తుందని సురేందర్ రెడ్డి, పైడిపల్లి రాజులు ఒక సంయుక్త ప్రకటనలో హెచ్చరించారు.




# కాంగ్రెస్ గుండాగిరి చేస్తోంది

## - బిజెపి స్టేట్ ఆఫీస్ పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం
## - జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి

**కరీంనగర్ ప్రతినిధి (మన వెలుగు) జనవరి 07 :** రాష్ట్రంలో కాంగ్రెస్ గుండాగిరి మొదలుపెట్టిందని, బిజెపి స్టేట్ ఆఫీస్ పై కాంగ్రెస్ గుండాలు దాడి చేయడాన్ని జిల్లా పార్టీ పక్షాన తీవ్రంగాఖండిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కాంగ్రెస్ విస్మరించిందని , కేవలం రౌడీయిజాన్ని నమ్ముకొని దాడులు చేస్తుందన్నారు. ఆ దిశలోనే బిజెపి రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ గుండాలు రాళ్లు , కోడిగుడ్లతో దాడులు చేశారని , ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదన్నారు. ప్రజాస్వామ్యవాదులు అందరూ ఇలాంటి దాడులను ఖండించాలన్నారు. దాడులు చేసిన కాంగ్రెస్ గుండాలను వెంటనే అరెస్టు చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి, పి సిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ లు బిజెపి కార్యాలయం పై జరిగిన దాడికి సమాధానం చెప్పాలన్నారు.



# బిజెపి రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని నిరసిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

**కరీంనగర్ ప్రతినిధి (మన వెలుగు) జనవరి 07 :** బిజెపి రాష్ట్ర కార్యాలయం పై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేయడం పట్ల కరీంనగర్ బిజెపి శ్రేణులు భగ్గుమన్నారు. మంగళవారం రోజున కరీంనగర్లోని కోర్టు చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టి రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావ్ మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర కార్యాలయం పై దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. పార్టీ కార్యాలయంపై జరిగిన దాడి పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దాడిపై సమాధానం చెప్పకపోతే రౌడీయిజాన్ని, దౌర్జన్యాలను వారే పెంచి పోషిస్తున్నట్లేనన్నారు. దాడుల సంస్కృతి సమంజసం కాదని, చట్ట వ్యతిరేక పనులను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహించడం మూర?త్వం చర్య అన్నారు.ఎవరైనా తప్పుడు వ్యాఖ్యలు చేసినట్లయితే ప్రజాస్వామ్య బద్దంగా ఖండించాల్సినటువంటి అవసరం ఉందని ,అవసరమైతే చట్టపరంగా కూడా శిక్షించవచ్చు కానీ రాష్ట్రంలో అధికారం చేతిలో ఉందని చట్టాన్ని చేతిలోకితీసుకొనిభయభ్రాంతులకు గురి చేస్తూ కార్యాలయాల పైన దాడులకు తెగబడడాన్ని దుర్మార్గమైన చర్యగా భావిస్తున్నామని తెలిపారు.. కార్యాలయం పైన దాడికి పాల్పడ్డ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలను వెంటనే అరెస్టు చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.



# పోలీస్ అధికారులకు రాష్ట్ర స్థాయిలో
# సేవ పతకాలు రావడం అభినందనీయం

**గద్వాల (మన వెలుగు) జనవరి 07 :** విది నిర్వహణలో ప్రజలకు అందించిన ఉత్తమ సేవలకు గుర్తుగా పోలీస్ అధికారులకు రాష్ట్ర స్థాయిలో సేవ పతకాలు రావడం అభినందనీయమని జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు అన్నారు.నూతన సంవత్సర%శీ% ను పురష్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 1 వ తేదీన ప్రకటించిన సేవ పతకాల కు జిల్లా నుండి ఎంపిక అయిన( హెడ్ కానిస్టేబుల్స్ నారాయణ, రవీందర్ గౌడ్,ప్రభాకర్ రెడ్డి, పురెందర్ మరియు వెంకటస్వామి గౌడ్) అధికారులను ఈ రోజు జిల్లా ఎస్పీ తన ఛాంబర్ లో ప్రత్యేకంగా ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,పోలీస్ శాఖలో ప్రజల మన్ననలు పొందేలా అధికారులు సిబ్బంది చేసిన సేవలకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందని, లభించిన గుర్తింపు తో ప్రజలకు మరింత సేవల అందించేలా కృషి చెయ్యాలని, అలాగే విధి నిర్వహణలో తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ అధికారుల సూచనలు పాటిస్తూ ప్రజలకు సేవ చేయడంలో భాద్యతగా తమ వంతు కృషి చేయాలని, అలాంటి సిబ్బందికి ఎప్పటికైనా మంచి గుర్తింప తప్పకుండా లభిస్తుందని అన్నారు.




# రమేష్ బిదురిపై చర్యలు తీసుకోవాలి

## - బీజేపీ ఏమ్మెల్యే అభ్యర్దిని వెంటనే సస్పెండ్ చేయాలి
## - జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బీజేపీ దిష్టిబొమ్మ దగ్ధం

**హన్మకొండ (మన వెలుగు) జనవరి 07 :** అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి,వయనాడ్ పార్లమెంట్ సభ్యురాలు ప్రియాంక గాంధీపై ఢిల్లీ రాష్ట్ర, కల్కాజీ నియోజకవర్గ బీజేపీ ఏమ్మెల్యే అభ్యర్థి రమేష్ బిదూరి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి.ఈ మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బిజెపి పార్టీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. మహిళ లంటే కనీస గౌరవ,మర్యాద లేని వ్యక్తికి బీజేపీ పార్టీ టికెట్ ఇచ్చి వారికి ఓట్లు వేయమని అడగటం సిగ్గుచేటని అన్నారు.రమేష్ బిదూరి వాక్యాలను వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని,బీజేపీ పార్టీ రమేష్ ని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.అభివృద్ధి పక్కన పెట్టి మత విద్వేషాలు, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం సరికాదన్నారు.బీజేపీ పార్టీ దేశ అభివృద్ధి కోసం పాటుపడాలని,మహిళలను గౌరవించాలని సూచించారు. మా పార్టీ కార్యకర్తల సహనాన్ని పరీక్షించవద్దు అని హేచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# గురుకుల విద్యార్థులను పరామర్శించిన బిజెపి శ్రేణులు

**కరీంనగర్ (మన వెలుగు) జనవరి 07 :** కరీంనగర్ పట్టణం శర్మానగర్లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలోని 23 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దృశ్య మంగళవారం స్థానిక బిజెపి శ్రేణులు ఆసుపత్రికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని, ఫుడ్ పాయిజన్ గల కారణాలను వైద్యులనుఅడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యాలతో జీవితాలతోచెలగాట మాడుతుందని అనునిత్యం రాష్ట్రంలోని ఎక్కడో ఒకచోట ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్న రాష్ట్ర ప్రభుత్వం తగిన నివారణ చర్యలు చేపట్టడం లేదని బిజెపి పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగల పవన్, కొలగని శ్రీనివాస్, కటకం లోకేష్,నాగసముద్రం ప్రవీణ్,శివారెడ్డి, పాదం శివరాజు, కరండ్ల రతన్ , సంతోష్ సీనియర్ నాయకులు ఓదెలు, నాంపల్లి శ్రీనివాస్, చడా ఆనంద్, మాసం గణేష్, పొన్నం మొండన్న , బండారు గాయత్రి,సత్యనారాయణ, కేంచ శేఖర్, ఉప్పరపెల్లి శ్రీనివాస్, శ్రీరాముల శ్రీకాంత్, ఈస్సాపెల్లి మహేష్, అనిల్ , అశోక్, భారత్ ,వినయ్, సురేష్,ఆనంద్,నరేష్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# పలు సమస్యలకు పరిస్కారం చూపిన ఎమ్మెల్యే

**గోదావరిఖని (మన వెలుగు) జనవరి 07 :** గోదావరిఖని లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా పాలన లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఒక్కరికి సమన్యాయం చేయాలనే ఉద్దేశ్యం తో ఏర్పడిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం దానికి అనుగుణంగా రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ రోజు ప్రజలు అనేక సమస్యలను ఎమ్మెల్యే శ్రీ మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ గారి దృష్టికి తీసుకొని రాగ వెంటనే వారి సమస్యలను, వారు ఎదుర్కొంటున్నా అనేక ఇబ్బందులను సావధానంగా విని వారి సమస్యలను పరిష్కరించి ప్రజా పాలన అంటే ఏవిధంగా ఉంటుంది అని నిరూపించారు.ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



# గంజాయి అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు



**గొల్లపెల్లి (మన వెలుగు) జనవరి 07 :** గొల్లపల్లి మండలం లోత్తునూరు గ్రామంలో జగిత్యాల కు చెందిన సాయికుమార్ (26) అనే వ్యక్తి వద్ద నుండి 270 గ్రాముల గంజాయి నీ స్వాధీనం చేసుకొని ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసిన గొల్లపెల్లి ఎస్ఐ సతీష్.గంజాయి కలిగి ఉన్న వ్యక్తి ని చాకచక్యంగా పట్టుకొని కేసు నమోదు చేసినందుకు గొల్లపల్లి ఎస్ఐ సతీష్ మరియు సిబ్బందిని అభినందించిన ఉన్నతాధికారులు.ఈ సందర్భంగా గొల్లపల్లి మండల ప్రజలకు మరియు చుట్టుపక్క గ్రామాల ప్రజలకు మీ గ్రామంలో ఎవరైనా గంజాయి అమ్మిన తాగిన వారి యొక్క సమాచారం గొల్లపల్లి పోలీస్ వారి ఈ పోన్ నంబర్ కి (8712656826) తెలియజేయగలరు అని తెలియజేసిన వారి యొక్క వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అని గొల్లపల్లి ఎస్ఐ తెలియజేశారు.

# చైనా మాంజాను వినియోగించవద్దు




**ముధోల్ (మన వెలుగు) జనవరి 07 :** సంక్రాంతి వేళ గాలిపటాలు ఎగరవేయడానికి నిషేదిత చైనా మాంజా దారాన్ని ఉపయోగించరాదని ముధోల్ ఎస్సై సంజీవ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ముధోల్ లో ప్రజలకు చైనా మాంజా-జాతీయ రహదారి భద్రత మహోత్సవాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైనా మాంజా ఎంతో డెంజర్ అని తెలిసిన విచ్చలవిడిగా అమ్ముతుండటం నేరమన్నారు. దీంతో మనుషుల ప్రాణాలకు పక్షుల ప్రాణాలకు ముప్పు పొంచి వుందని పేర్కొన్నారు. చైనా మాంజాను ఎవరైనా అమ్మిన ఉపయోగించిన చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు గమనించి చైనా మంజాను ఉపయోగించకుండా చూడాలని ఆయన కోరారు. అనంతరం జాతీయ రహదారి భద్రత మహోత్సవాల్లో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే నష్టాలను వివరించారు అదేవిధంగా సూచించారు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వద్దని పేర్కొన్నారు ట్రాఫిక్ నియమ నిబంధనలకు అనుగుణంగా వాహనాలను నడపాలని అన్నారు. అతివేగమే ప్రమాదం అన్న విషయాన్ని మరువకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

# హమాలీల సమ్మెకు మద్దతుగా జనసేన

**ముధోల్ (మన వెలుగు) జనవరి 07 :** భైంసా పట్టణం లోని సివిల్ సప్లయ్ హమాలీలు గత 7 రోజులుగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్నారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు సుంకేట మహేష్ బాబు హాజరై మాట్లాడారు. హమాలీలకు కూలి రేట్లు పెంచాలని, గతంలో కమిషనర్ దగ్గర జరిగిన కూలి రెట్ల ఒప్పంద జిఓ ను వెంటనే విడుదల చేయాలని కోరారు.హమాలీల సమ్మె ద్వారా రాష్ట్రం లో బియ్యం పంపిణి నిలిచిపోయే పరిస్థితి వచ్చింది. వారు కోరుతున్న డిమాండ్స్ గోంతమ్మ కోరికలేమి కావు పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కూలి రెట్లను పెంచాలి కాని కాంగ్రెస్ ప్రభుత్వం అస్సలు పట్టించుకోవడం లేదు సాధారణ హమాలీల పరిస్థితి ఇలా ఉంటే సామాన్యుడు పరిస్థితి గురించి ఇంకా చెప్పాల్సిన అవసరం లేదు. సమస్య పరిష్కారం కాక పోతే భవిష్యత్ లో జరగబోయే పోరాటానికి జనసేన పూర్తి స్థాయిలో మద్దతూ తెలియచేస్తుంది. దానికి భాద్యత ప్రభుత్వం వహించాల్సి వస్తుంది.ఈ కార్యక్రమం లో హమాలీ సంఘం అధ్యక్షులు ముత్యం, తెలుగుదేశం జిల్లా అధ్యక్షులు తెలి రాజు తదితరులు పాల్గొన్నారు.




# బాలానగర్ లో సీసీ కెమెరాలతో తగ్గుతున్న నేరాలు

## - ఏసీపీ హనుమంతా రావు




**కూకట్పల్లి (మన వెలుగు) జనవరి 07 :** బాలానగర్ పోలీస్ స్టేషన్ పరధిలోని రాజు కాలిని ఇంటి యజమానులకు సీసీటీవీ అవగాహన కల్పించే సదస్సును బాలానగర్ సీఐ నర్సింహా రాజు ఆధ్వర్యంలో బాలానగర్ ఏసీపీ హనుమంతా రావు నిర్వహించారు. అదేవిధంగా బేతేసదా ప్రార్థన మందిరంలో ఇటీవల ఏర్పాటు చేసినా సీసీటీవీ కెమెరాలను ఏసీపీ హనుమంతా రావు, సీఐ నర్సింహా రాజు, ఎస్ఐ హాజీ మియాతో కలిసి ప్రారంభించారు. ఈ సదస్సుకు అనేక మంది ఇంటి యజమానులు హాజరయ్యారు. ఈ సందర్బంగా ఏసీపీ హనుమంతా రావు మాట్లాడుతూ, ప్రస్తుతం బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాలలో దోపిడీ, దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టే విధంగా భద్రతాపరమైన చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టడం అవసరమని ఏసీపీ అన్నారు. ఈ సందర్భంలో ప్రతి ఇంటి యజమాని సీసీటీవీ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా స్థానికంగా భద్రతను మెరుగుపరచాలని సూచించారు. అనంతరం సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ,ప్రస్తుత పరిస్థితుల్లో అనుమానాస్పద వ్యక్తులు, సంఘవిద్రోహ శక్తులు స్థానికంగా సంచరిస్తున్నారని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండడం అవసరం అన్నారు. కెమెరాలు నేరస్థులపై గట్టి నియంత్రణ సాధించడానికి ముఖ్యమైన సాధనం అని పేర్కొన్నారు. ఏమైనా అనుమానిత వ్యక్తులు పరిసర ప్రాంతాల్లో సంచరిస్తే వెంటనే పోలీసులకు డయల్ 100 లేదా 9490617444 సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పి. రవి కృష్ణ, గోపాల్, సత్యపాల్, కిషోర్ కుమార్, నయీమ్, పరంజ్యోతి, బెంజమిన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన డిఐఈఓ



**ముధోల్ (మన వెలుగు) జనవరి 07 :** మండల కేంద్రమైన తానూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం నిర్మల్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పరశురామ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సిలబస్ గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా విద్యార్థుల సబ్జెక్ట్ నోట్స్ చూసి క్రమం తప్పకుండా కళాశాలకు రావాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడానికి 90 రోజుల ప్రణాళికను తప్పనిసరిగా అమలు చేయాలని అధ్యాపకులను ఆదేశించారు. డిఐఈఓ వెంట కళాశాల ప్రిన్సిపల్ ఫణి రాజశేఖర్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

# మన వెలుగు క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎస్ఐ సతీష్




**గొల్లపెల్లి (మన వెలుగు) జనవరి 07 :** జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం నూతన సంవత్సరం 2025 ను పురస్కరించుకొని మన వెలుగు పత్రిక క్యాలెండర్ ను గొల్లపెల్లి ఎస్ ఐ సతీష్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను అధికారులకు తీసుకోచ్చే బాధ్యత విలేకరులదేనని గుర్తు చేసారు.రాత్రి పగలు తేడా లేకుండా ప్రజల కోసం పని చేస్తున్న విలేకరులకు తమ అభినందనలు తెలియజేసారు. అనంతరం మన వెలుగు క్యాలెండర్ ని ఆవిష్కరించడం జరిగింది.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముభారక్ చెక్కుల పంపిణీ

**ముధోల్ (మన వెలుగు) జనవరి 07 :** కుభీర్ మండల కేంద్రంలోని మండల తహశీల్దార్ కార్యాలయం నందు మండల ఆయా గ్రామాల కళ్యాణ లక్ష్మి,(72) షాదీ ముభారక్ (4) చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనీ 76 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన స్థానిక శాసన సభ్యులు పవార్ రామారావు పటేల్ ,అనంతరం మండలానికి చెందిన ఆయా గ్రామాలకి చెందిన 23 మంది లబ్ధదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు ఈ కార్యక్రమంలో , డిప్యూటీ తహశీల్దార్, ఆయా గ్రామాల తాజా మాజీ, ప్రజా ప్రతినిధులు , సర్పంచులు ,ఎంపీటీసిలు, మండల నాయకులు , కార్యకర్తలు , మండల ఆయా సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

# కోరుట్లలో వ్యభిచార ముఠా గుట్టు రట్టు



**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) జనవరి 07 :** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో కొంతకాలంగా సెక్స్ రాకెట్ ను ఓ వ్యక్తి నిర్వహిస్తుండగా గుట్టు రట్టు చేసి నిర్వాహకున్ని కోరుట్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.కోరుట్ల పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో సోమవారం రాత్రి 11 గంటలకు ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతుందని ఆదర్శనగర్ కాలనీవాసులు పోలీసులకు సమాచారం అందించారు.దీనితో రంగంలోకి దిగిన పోలీసులు రెండు జంటలు ఓ నిర్వాహకున్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.అయితే గత కొంతకాలంగా కోరుట్ల మెట్ పల్లి పట్టణ శివారు కాలనీల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నారన్న వాదనలు సైతం వినిపించగా ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని ఆదేశించారు. రంగంలోకి దిగిన పోలీసులు గత కొద్ది కాలంగా నిఘా పెట్టారు. అయితే తాజాగా సోమవారం సమాచారం అందుకున్న పోలీసులు విటులను రెడ్ హ్యాండ్ గా పట్టుకున్నారు. పట్టుబడిన నిర్వహకులు ఓ పెద్దమనిషిగా సొసైటీలో పేరుగాంచిన వారిగా తెలుస్తుంది. కానీ నిర్వహకుడిని తమదైన శైలిలో విచారణ చేస్తే భారీ స్థాయిలో సెక్స్ రాకెట్ గుట్టురట్టయే అవకాశం కూడా ఉందని తద్వారా ఆయా కాలనీలో అసాంఘిక కార్యకలపాలకు ముగింపు పలికే అవకాశం కూడా ఉందని ఆయా కాలనీవాసులు తెలుపుతున్నారు. అదుపులోని తీసుకున్న ఇద్దరు విటులు నిర్వహికుని పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కోరుట్ల ఎస్ ఐ శ్రీకాంత్ తెలిపారు.

# విద్యార్థుల అపూర్వ సమ్మేళనం




**ముధోల్ (మనవెలుగు) జనవరి 07 :** బాల్యం ఎంతో అపురూపమైనదని అందరికీ తెలుసు కానీ చదువులమ్మ ఒడిలో ఒక్కటైనా వివిధ గ్రామాల విద్యార్థులు పదో తరగతి వరకు చదివి పై చదువుల నిమిత్తం విడిపోవాల్సి వచ్చినప్పుడు ఆ బాధ వర్ణనాతీతం. ఈ పరిస్థితి పది చదివిన ప్రతీ విద్యార్థికి తెలుసు కానీ ఇరవై సంవత్సరాల తర్వాత అదే బడిలో.. అదే తరగతి గదులలో మార్గదర్శనం చేసిన పంతుళ్ళతో కలిస్తే ఎంత మధురంగా ఉంటుంది కదా... అటువంటి సన్నివేశమే ముధోల్ మండలం ఆష్ట గ్రామంలో జరిగింది. 2004-05 లో పదోతరగతి పూర్తి చేసుకొని పై చదువులు చదివి కొందరు ఉద్యోగాల్లో ఉంటే... మీ కంటే మేమేమి తక్కువ మేమిక్కడ వ్యవసాయం చేస్తున్నాం మేము విదేశాల్లో ఉన్నాం ఇలా ఒక్కొక్కరి తీపి మాటలను పంచుకుంటూ ఆనాడు మా గురువులు మమ్మల్ని బెత్తంతో కొట్టకుంటే ఈ రోజు మేము ఇంత మంచి స్థాయిలో ఉండే వాళ్ళము కాదేమో అని విద్యార్థులు తమ ప్రసంగాలలో వినిపించిన తీరు ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకుంది.కార్యక్రమ అనంతరం గురువులకు సన్మానించడం జరిగింది. కార్యక్రమానికి గురువులందరూ హాజరు కావడం.. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆష్ట గ్రామంలో చాలా కాలంగా గురువులుగా సేవలందించినందుకు తమ శిష్యులు విదేశాల నుంచి చరవాణి ద్వారా పలకరించడం తమకు నూతన ఉత్తేజాన్ని ఇస్తాయని అన్నారు.

# చైనా మాంజాను అమ్మినా కొన్నా జైలుకే




**బాసర (మన వెలుగు) జనవరి 07 :** నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల మరియు సీఐ మల్లేష్ ఆదేశాల మేరకు బాసరలో గల దుకాణాలలో పోలీసు సిబ్బంది తనిఖీ నిర్వహించడం జరిగింది.మండల కేంద్రంలో గాని చుట్టు పక్కల గ్రామాలల్లో ఎవరైనా చైనా మాంజాను విక్రయించినా లేదా షాపుల్లో కొన్నటువంటి వ్యక్తులకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ యాక్ట్ -2016 ప్రకారం ఐదు సంవత్సరాల జైలు శిక్ష లేదా పదివేయిల వరకు జరిమాన విధించే అవకాశం ఉందని బాసర ఎస్ఐ కే. గణేష్ తెలియజేసారు. చైనా మాంజా వాడడం వల్ల మనుషులకు అలాగే పక్షులకు ప్రమాదం పొంచి ఉందని సంక్రాంతి పండగ సంబరంగా సందడిగా జరుపుకోవాలని మన ఆనందం కోసం మూగ జీవాల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని సూచించారు.ఒకవేళ పోలీసు వారి నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

### - ముక్కోటి ఏర్పాట్లు పరిశీలించిన విప్ అడ్లూరి



**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) జనవరి 07 :** ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలోని ఈఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ముక్కోటి ఏకాదశి ఏర్పాట్ల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మపురి నియోజక వర్గ ప్రజలు ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దర్శించుకొని స్వామి కృపకు పాత్రులు కాగలరని కోరారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా దైవ దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని,గత ఏడాది ఏమైనా లోపాలు సమీక్షించుకుంటూ తిరిగి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని,వేద పండితులు,అర్చకుల సూచనల మేరకు,సమయపాలనకు అనుగుణంగా వైకుంఠ ద్వారాలను తెరవాలని సూచించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన టిక్కెట్ కౌంటర్లను విప్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ సంగి సత్తెమ్మ, వైస్ చైర్మన్ ఇందరపు రామన్న, మున్సిపల్ కమిషనర్ కందుకూరి శ్రీనివాస్, సిఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్ కుమార్,కాంగ్రెస్ నాయకులు సంఘనబట్ల దినేష్,వేముల రాజేశ్,చిలుముల లక్ష్మణ్, జక్కు రవీందర్,రందేని మొగిలి, అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుంది

### - మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత



**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) జనవరి 07 :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేస్తుందని, రైతులకు పెట్టుబడి సాయం అందించిన ఏకైక నాయకుడు మాజీ సీఎం కేసిఆర్ అని మాజీ జడ్పి చైర్పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామంలో రైతు భరోసా కింద రైతులకు రూ. 15వేల సాయం చేస్తామని చెప్పి రూ. 12 వేల సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడం పట్ల బిఆర్ఎస్ శ్రేణులు పోలాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దావ వసంత మాట్లాడుతూ తెలంగాణ రైతన్నను రాజు చేయాలనే ఉద్దేశ్యంతో ఎన్నికల్లో హామీ ఇవ్వకున్న మాజీ సీఎం కేసిఆర్ రైతుబంధు పథకాన్ని అమలు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు. 11 సీజన్లలో రూ.73వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రైతులను దగా చేస్తుందని, ఎన్నికల సమయంలో రైతు భరోసా ద్వారా రూ.15వేల సాయం అందిస్తామని చెప్పి ఇప్పుడు రూ.12వేల సాయం అందిస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసిందని గొప్పులు చెప్పుకుంటుందని, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నలను సీఎం రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఆనందరావు, తుమ్మ గంగాధర్, ఆసీఫ్, కమలాకర్రావు, గంగారావు, గంగారెడ్డి, ప్రవీణ్, లక్ష్మణ్, సన్నిత్రావు, చందు, శరత్ రెడ్డి, మహేస్, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు మోగిన నగారా




**ఢిల్లీ (మన వెలుగు) జనవరి 07 :** కేంద్ర ఎన్నికల సంఘం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. ఢిల్లీలో 70 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.. మీడియా సమావేశంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ డిల్లీ అసెంబ్లీ ఎన్నికల వివరాలను వెల్లడించారు.. ఢిల్లీలోని మొత్తం 70 స్థానాలకు ఫిబ్రవరి 5న ఒకే దశలో ఓటింగ్ నిర్వహించ నున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. ఢిల్లీలో ఎన్నికల కోడ్ వెంటనే అమల్లోకి వచ్చినట్టు ఈసీ ప్రకటించింది.ఈనెల 10వ తేదీన ఢిల్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుంది. ఫిబ్రవరి 17వ తేదీ వరకు నామినేషన్ల గడువు విధించారు. ఈనెల 20వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు.

## జిల్లా పరిధిలో పోగొట్టుకున్న 120 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేత

### - సైబర్ మోసాల పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### - జిల్లా ఎస్పీ అశోక్ కుమార్







**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) జనవరి 07 :** సెల్ ఫోన్ పోయిన, చోరీకి గురైన ఆందోళన చెందవద్దని సీఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని జిల్లా ఎస్పీ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో పోగొట్టుకున్న, చోరి గురైన 120 మొబైల్ ఫోన్లను ( సుమారు 18 లక్షల విలువగల ) స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోయిన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి సీఈఐఆర్ వెబ్సైట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సీఈఐఆర్ వెబ్సైట్లో వినియోగదారులు వివరాలను నమోదు చేసుకుంటే మొబైల్స్ ని ఈ పోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఒక ఆర్ ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుల్ లతో ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరగిందని అన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 786 ఫోన్ లను రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగిందని అన్నారు. సీఈఐఆర్ ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పోయిన సెల్ ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఫోన్లలో ఉన్న వ్యక్తిగత ఆధారం గురించి నష్టాన్ని కాజేస్తుందన్నారు. ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. దొంగిలించిన ఫోన్లను నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ సీఈఐఆర్ వెబ్సైట్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అదే విదంగా ఎవరైనా సెకండ్ హాండ్ ఫోన్ లు కొనే ముందు అప్లికేషన్లో అట్టి ఫోన్ యొక్క వివరాలను అనగా ఐఎమ్ఈఐ నంబర్లు నమోదు చేసి చెక్ చేసుకోవాలని తద్వారా అట్టి ఫోన్ ఆ ఫోన్ యొక్క స్టేటస్ తెలుస్తుంది అన్నారు. అదేవిధంగా ఎవరికైనా సెల్ఫోన్లు దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్లో గాని లేదా ఆ నెంబర్ వారికి ఫోన్ చేసి వారికి అప్పగించాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్లో రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఐటి కోర్ ఇన్స్పెక్టర్ రఫీక్ ఖాన్ సీఈఐఆర్ టీం ఆర్ఎస్ఐ కృష్ణ ,హెడ్ కానిస్టేబు ల్ మహుముద్ , కానిస్టేబుల్ లు అజర్ యాకూబ్, లను జిల్లా ఎస్పీ అభినందించారు.

**సైబర్ మోసాలపైప్రజలు అప్రమత్తంగా ఉండాలి...**

పెరిగిన సాంకేతిక పరిజ్ఞానికి అనుగుణంగా సైబర్ మోసగాళ్లు వివిధ రూపాల్లో ప్రజలను బురిడి కొట్టించి డబ్బులు దండుకుని మోసాలకు పాల్పడుతున్నారని ఇలాంటి వాటిపై అందరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫేక్ ఫోన్ కాల్స్ కు స్పందించకపోవడమే మంచిదని, ఇంటర్నేషనల్ కాల్స్, కొత్త నంబర్ల నుంచి ఫోన్ వస్తే అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అజ్ఞాత వ్యక్తుల కు ఎలాంటి వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దని, డ్రగ్స్ కేసు అని, ఉగ్రవాదులతో సంబంధాలని బెదిరించగానే భయపడి డబ్బులు బదిలీ చేయొద్దని సూచించారు. ఒకవేళ మోసానికి గురైతే వెంటనే సైబర్ క్రైం హెల్ప్ లైన్ నంబర్ 1930 ఫోన్ చేయాలని కోరారు. లేదంటే స్థానిక పోలీస్ స్టేషన్ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా బాధితులు తమ యొక్క ఫోన్ పోయినా విధానాన్ని వారు ఫోన్ పోయినప్పుడు అవలంబించిన విధానాన్ని తెలియజేశారు.సాంకేతికతను ఉపయోగించి పోయిన సెల్ఫోన్లను తిరిగి కనిపెట్టి తమకు ఇచ్చినందుకు బాధితులు ఎస్పీకిచాలా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటి కోర్ ఇన్స్పెక్టర్ రఫీక్ ఖాన్ , సీఈఐఆర్ టీం హెడ్ కానిస్టేబుల్ మహుముద్, కానిస్టేబుల్ అజర్ యాకూబ్ పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ సమస్యల పరిష్కరించాలని ఆర్డీవోకు వినతి



**మెట్ పల్లి టౌన్ (మన వెలుగు) జనవరి 07 :** మెట్ పల్లి ఆర్డీవో కార్యాలయంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ఆర్డీవో ను కలిసి ఏఐటీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి ఏ భాగ్యలక్ష్మి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ కు కనీస వేతనం రూపాయలు18,000 ఇస్తామన్న హామీ అమలు చేయాలని ఇంటి అద్దెలు గ్యాస్ బిల్స్ ఇతర పెండింగ్ బిల్స్ మినీ టీచర్స్ వారి పదోన్నతికి పెంచిన జీతాలు 7,500 నుండి 13,650 రూపాయలు అమలు పరచకుండా గత తొమ్మిది నెలల నుండి ఆయా గౌరవ వేతనం అందిస్తున్నారు కావున పెండింగ్ మినీ వేతనాలు అందించాలి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ఐసిడిఎస్ కు నిధులు పెంచాలి అంగన్వాడి సెంటర్స్ అభివృద్ధికి నిధులు ఇవ్వాలి ఖాళీగా ఉన్న ఆయా టీచర్ పోస్టులు భర్తీ చేయాలి మెనూ చార్జీలు ప్రియతమ ధరల ప్రకారం పెంచాలి బిఎల్వో డ్యూటీ లు రద్దు చేయాలి అంగన్వాడి కేంద్రాలు కు బిల్డింగ్స్, త్రాగునీరు, విద్యుత్ సరఫరా ఇవ్వాలి 5జి సెల్ ఫోన్లు ఇవ్వాలి గ్రాడ్యుటి 15 లక్షలు హెల్త్ కార్డులు ప్రతి నెల నూనె, పప్పులు, గుడ్లు నాణ్యమైనవి అందించాలని పై అంశాలు పరిశీలించి తక్షణం పరిష్కారం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ ప్రధాన కార్యదర్శి ఏ భాగ్యలక్ష్మి, కొలు సుమలత, లావణ్య, సుల్తానా, రోదసి, అంగన్వాడీ టీచర్స్, ఆయాలు, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.